స్కెచ్

# త్రిభుజాకార సత్యం

కె. రామలక్ష్మి

"మొగవాళ్ళని చూస్తూన్న కొద్దీ నవ్వు వస్తుంది. మీ మొగవాళ్ళు ఒకొక్కప్పుడు చాలా హాస్యాస్పదంగా ప్రవర్తిస్తారు సుమండీ!" అన్నది ఆమె కలలో నవ్వుకుంటున్నట్టు చిన్న నవ్వు నవ్వుతూ. ఈ మాటల్లోని గూఢార్థములో యిమిడి ఉన్నది హేళనో పొగడ్తో తెలుసుకోలేక దొరికిపోకుండా అన్నాను: "ఆహాఁ నిజంగానే!"

"అయితే మరీ అఘాయిత్యం! ఎందుకు పెళ్లాడానా అని ఒకొక్కప్పుడు అనుకుంటారు. పాపం ఇంకా అతని తలంతా కట్లతోనిండే వుంటుంది బహుశా."

"ఏమిటి? మీవారిదా? ఆయన..."

ఆమె నావైపు చాలా జాలితో చూసింది. "మావారి తలకాదండీ. మావారు యింకొకరి తల పగలకొట్టారు."

"ఏం జరిగింది? ఎక్కడించేనా పడ్డాడా యేమిటి?"

"లేదు, లేదు ఆ చిన్నవాడి తల యీయనే పగలకొట్టారు."

నిస్సహాయతని తెలియబరుస్తూ ఆవిడకేసి చూశాను: "మీరు విడమర్చి చెప్పేదాకా నాకేం అర్థం కావడంలేదు. దయచేసి చెప్తారా?"

"మీరు అసలు సంగతి వినలేదన్న సంగతే గుర్తుకిరాలేదు సుమండీ. మూడు వారాల క్రింద సంగతి. సినిమా రెండవ ఆటకి వెళ్ళివస్తూ దగ్గర కదా అని పార్కుకి అడ్డపడి వస్తున్నాం నేనూ మా ఆయనా. ఎలక్ట్రిక్ దీపంకింద బెంచీమీద దీర్ఘాలోచనలో మునిగిపోయినట్టు కూర్చుని ఎవరో ఒకతను వున్నాడు. బాగున్నాడు సుమండీ, తెల్లగా వున్నాడు నల్లటిజుట్టూ, యిలాంటివాళ్లు చాలా గమ్మత్తుగా ప్రవర్తిస్తారు కొన్ని సమయాల్లో. చక్కటి తెల్లచీర కట్టుకునివున్నా నేమో ఆ చీకట్లో ఎలా కనబడ్డానో ఏమో కళ్లు విప్పి నాకేసి చూశాడు. అంతే-గభాలున లేచి మావారి చేతిమీద చెయ్యివేసి "అగ్గిపెట్టివుంటే ఇస్తారా?" అని అడిగాడు. మావారుమటుకు తక్కువ తిన్నారా? అతనిచెయ్యి తోసేసారు. మెరుపులా కిందికివంగి ఓపెద్ద యిటికబొంత తీసి అతని నెత్తిని పగలకొట్టారు. పాపం! స్పృహతప్పి పడిపోయాడు క్రింద. దారుణం!" అని చెప్పేసి దీర్ఘంగా నిట్టూర్చింది ఆమె.

"ఇదేమిటండీ మరీ అన్యాయం. ఇంతట్లోనే అంత అసూయ యెందుకు మీవారికి? మీరు అందంగా వుండడంతప్పా? అతను మీకేసి చూడ్డం తప్పా?" దెబ్బతిన్న అతన్ని తల్చుకుంటే వచ్చిన జాలిచేత అన్నాను.

"అందుకే మొగాళ్లు చాలా వింతమనుషులూ హాస్యాస్పదులూ అన్నాను కదూ!" అంది ఆమె తృప్తిగా తన భుజాలకేసి ఓసారి చూసుకుంటూ.

"మరి నే వస్తాను" అని అనేసి బయలుదేరాను. ఆమెభర్త కనిపిస్తే నిజంగా అడగాలని అనిపించింది. నేను తలపోసినట్లే సందు మళుపులో ఆయన తటస్థపడ్డాడు.

"ఏమండోయ్! ఏమి టీవింత! దారినపోయే మనుషుల బుర్రలు పగలకొడుతున్నారట" అని పలకరింపుగానే అడిగేశాను.

అతను అదోమాదిరి నవ్వుతూ "అదీసంగతి మా ఆవిడగాని కనిపించిందేమిటి? ఇటికబొంత సమయానికి దొరకడం నిజంగా అదృష్టం అనుకోండి! ఇంకోలా అయితే...నాజేబులో మూడు వందలదాకా రొక్కం వుంది. జేబులో ఖరీదైన పెన్నులు రెండు. ఇన్నింటికీపైని మాఆవిడ అర్థరాత్రి అనేనా ఆలోచించకుండా రవ్వలదుద్దులూ, గాజులూ వేసుకుని సిద్ధం. ఎన్ని చెప్పండి ఆడవాళ్ళకి నగలపిచ్చి పోదు. ఆ పార్కులోంచి వద్దే చీకటి కొంచెం దూరంఅయినా ఫరవాలేదు రోడ్డుమీదనుంచి పోదాం అంటే, ఆవిడ వినలేదు...

పార్కు నిరామయం” అని ఆగాడు.

“నిన్ను దోచుకుందామనే వుద్దేశ్యంతో అతను...” అనబోయాను.

“నీకేం తెలుసునోయ్. ఏం తక్కువవాడు కాదతను. ప్రమాదకరమైన చిన్నవాడు నిరామయ ప్రదేశంలో ఒకరు కనిపించి అగ్గిపెట్టె అడగడానికి నాచెయ్యి పట్టుకుంటే యింతకంటె నీకింకేంకావాలోయ్” ఏదో అవమానింపబడ్డట్టు చూస్తూ వూరుకున్నాడు.

“అందుకని అతని తల పగలకొట్టావన్న మాట.”

“అవును. అతను ఆరవనైనాలేదు. నాకు తెలుసులే, అలాంటివాళ్ళని అదుపులోవుంచడం.”

నాకేదిన్కూ తోచలేదు. సెలవుతీసుకుని నడక సాగించాను. ఇలాంటివాళ్ళతో ఎలాగ? అనుకుంటూండగానే “యీవాళకి దొరికావు”అని నా వెనక మాటలు వినిపించాయి. ఎవరా అని వెను తిరిగి చూచాను; నా స్నేహితుడు. మూడువారాలవుతోంది అతని చూసి. “ఇన్నాళ్ళుగా నువ్వేమయావు? ఈ కట్లన్నీ ఏమిటీ?”అని ఆత్రంగా అడిగాను. “ఈవాళే ఆస్పత్రినించి వచ్చానురా. ఇంకా చాలా నీరసంగానే వుంది”అన్నాడు.

“ఏమిటి నాకేం తెలియలేదే. ఏం జరిగింది?”

ఒ చిన్ననవ్వు నిస్సహాయంగా నవ్వి తిరిగి నన్నే ప్రశ్నించాడు.

“చూడు భాయ్, ఈ మధ్య ఎవరేనా యీ ప్రాంతంలో పిచ్చివాళ్ళు కాని తప్పించుకు తిరుగుతున్నారా ఏమిటి? మూడువారాలక్రితం నాకు ఒకడు తటస్థపడ్డాడులే. దాని ఫలితమే యీ కట్లూ, ఆస్పత్రీ.

హఠాత్తుగా నా మనస్సులో ఆ నారీమణీ, ఆమె భర్తా మెదిలారు. కుతూహలం ఎక్కువయింది. “మూడువారాలక్రిందటా, పార్కులో నువ్వు కూర్చుని వున్నావా?”అన్నాను.

“అవునురా భాయ్. పేపర్లో చదివివుంటావు. చెప్పకుంటేకూడాసిగ్గు. ఏమీతోచక పార్కులో కూర్చున్నాను. ఎలాగేనా ఒక సిగరెట్టు కాల్చుకుంటే బాగుండుననిపించింది. కాని, దరిద్రం... అగ్గిపెట్టె కాళీ. సరేలే, సమయానికి దయాళువు ఎవడేనా యీదారిన రాడా—అనుకుంటూ కూర్చున్నాను. పది నిముషాలు దాటిందోలేదో, ఒకాయన ఓ ముసలమ్మలాంటిదాన్ని వెంటబెట్టుకు బయలుదేరి వస్తున్నాడు. చీకటిషికారు కాబోలు! ఏమైతే నాకేం? సిగరెట్టు కాలుస్తున్నాడు. దగ్గరికెళ్లి మర్యాదగా ఆయన చేయితట్టి “అగ్గిపెట్టి ఓసారిస్తారా?”అని అడిగాను. ఏమయిందనుకుంటున్నావు? ఆ పిచ్చివాడు కిందికివంగి ఏదోతీసి బలంగా నన్ను కొట్టాడు. మరుక్షణంలో నేను నేలమీద తలపగిలి ఒళ్లు తెలియకుండా పడిపోయాను.”

“నీకు గట్టి నమ్మకమేనా-ఆయన వుట్టి పిచ్చివాడని?”అతని ముఖంలోకి చూస్తూ అడిగాను.

“ఆఁ నాకు గట్టి నమ్మకమే. లేకుంటే యింకెవడేనా అలా ప్రవర్తిస్తాడా?”అని నవ్వేసి వెళ్ళిపోయాడు.

ఇంకో గంట గడిచేటప్పటికి అతిజాగ్రత్తగా మూడువారాల క్రితం పాతపేపర్లు వెతుకుతున్నాను నేను. చివరికి కనిపించింది నేను వెతికేది. ప్రమాదాల శీర్షికలో ఓ చిన్న నోటీసు:

“త్రాగుడు ప్రభావం: నిన్న పార్కులో ఒక బెంచీదగ్గర ఒకతను పడివుండడం పోలీసులు చూశారు. అతనిదగ్గర దొరికిన కాగితాలని బట్టి మంచి కుటుంబానికి చెందినవాడే అని తేల్చారు. ఎక్కువగా త్రాగివుండడంచేత, ఒళ్ళు తెలియకుండా పడిపోయివుంటాడని తేల్చారు. ఆ పడడంలో ఇటుకగట్టుపైపడి, తల పగలకొట్టుకున్నాడు.”

ఇన్ని రకాలుగా విన్న యీ ప్రమాదాన్ని గురించి నిజం ఎలా తేల్చుకోవడం? నాకు మతిపోయింది.

వ్యక్తిస్వాతంత్ర్యాలను, వ్యవస్థలను సంరక్షించడానికి, అవి ఆచంద్రార్కంగా వర్ధిల్లేటట్లు చూడడానికి ఎవరికివారుగా బాధ్యతవహించడం ప్రజలందరి యొక్క విధి. ఇతరులకు అప్పచెప్పగూడని వ్యక్తిగతమైన బాధ్యతలేవైనా ఉన్నాయంటే అవి ఇవే—అబ్రహామ్ లింకన్